సర్వేపల్లి ప్రజలకు రుణపడి ఉంటా

- రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేశారు
- మూడో పర్యాయం అవకాశం ఇవ్వండి
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో కాకాణి పూజిత

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా, మీరు రెండు పర్యాయాలు నన్ను ఎమ్మెల్యేను చేశారు.. మీ దయ వల్ల రాష్ట్రానికి మంత్రిని కూడా అయ్యాను.. మూడో పర్యాయం మీకు సేవ చేసుకునే భాగ్యం కల్పించండి అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారం చివరిరోజున శనివారం పొదలకూరు పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామనగర్‌గేట్ సెంటర్‌లో మాట్లాడుతూ ఎన్ని జన్మలెత్తినా సర్వేపల్లి ప్రజలకు రుణపడే ఉంటానన్నారు. 2014లో పొదలకూరు మినహాయిస్తే మిగిలిన మండలాలకు నేను కొత్త అయినప్పటికీ నన్ను ఆదరించి అక్కున చేర్చుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి మంత్రినైన తర్వాత సర్వేపల్లిని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంచాలని పట్టుదలతో అభివృద్ధి పనులు చేశానన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా జడిసేది లేదని, నేను చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుందన్నారు. విమర్శలు కనిపించవని, అభివృద్ధి కనిపిస్తుందన్నారు. పొదలకూరు పట్టణంలో రూ.2 కోట్లు వెచ్చించి మెయిన్‌రోడ్డును సిమెంటురోడ్డుగా మార్చానన్నారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులను ఆధునికీకరించినట్లు తెలిపారు. రూ.375 కోట్ల నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కింద సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇవి అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఇదే సెంటర్‌లో చంద్రబాబు సభ పెడితే పట్టుమని వెయ్యి మంది రాలేదన్నారు. ఇప్పుడు వచ్చిన వారు కేవలం పొదలకూరు మండల ప్రజలే అని, ఈ జనాలను చూసి సోమిరెడ్డికు నిద్రపట్టదన్నారు.

దూషించినా.. సహనం పాటించా

సోమిరెడ్డి ఆయన కోడలు ప్రచారంలో నా కుటుంబాన్ని దూషించినా సహనం పాటించానని మంత్రి కాకాణి అన్నారు. గ్రామాలకు వెళ్లి ఇష్టానుసారం తిట్టినా నాకు సంస్కారం అడ్డొచ్చి వారిని వ్యక్తిగతంగా మాట్లాడలేదన్నారు. అంతేకాకుండా కార్యకర్తలను సంయమనం పాటించాల్సిందిగా సూచించినట్లు చెప్పారు. సోమిరెడ్డికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీపీ సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ సోమా అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, ఎస్.మంజుల, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు ఎం.శివశంకర్ ఎం.శేఖర్‌బాబు, సోమా భాస్కర్‌రావు, ఎస్‌కే అంజాద్, ఖాదర్, ఎం.సతీష్‌కుమార్‌రెడ్డి, ఎం.రవికుమార్, జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, బి.భారతమ్మ, నోటి శ్రీలత, జి.వేణుగోపాల్‌రెడ్డి, తుమ్మల కిశోర్, ఎం.జనార్దన్, సోమా పెంచలయ్య, నర్ల వేమారెడ్డి, ఆదూరు వెంకటసుబ్బయ్య, తరుగు ప్రభాకర్, ఆకులూరు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

రెపరెపలాడిన వైఎస్సార్‌సీపీ జెండాలు

- పొదలకూరులో ర్యాలీ సూపర్ సక్సెస్

పొదలకూరులో నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలాడాయి. ఎన్నికల సంగ్రామానికి తాము సిద్ధం అంటూ నినాదాలు చేశారు. నలుమూలల గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీకి హాజరై తమ మద్దతు ప్రకటించారు. స్థానిక నెల్లూరురోడ్డు ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి రామనగర్‌గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించగా మంత్రి కాకాణి, ఆయన కుమార్తె పూజిత పాల్గొన్నారు. దారి పొడవునా సాధారణ ప్రజలు సైతం మద్దతు ప్రకటించి మంత్రిని సన్మానించారు. మూడు చోట్ల గజమాలల ద్వారా



స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి వారికి ప్రత్యేక ధన్యవాదాలు వ్యక్తం చేశారు.

ప్రశాంతిని గెలిపిస్తే అశాంతి తప్పదు

- వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పండి
- దశాబ్దాలుగా ప్రజాసేవలో నల్లపరెడ్డి కుటుంబం
- ఒక్క అవకాశం ఇవ్వండి. సేవ చేసుకుంటా
- రాజకీయాల నుంచి చంద్రబాబును తరిమికొట్టాలి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ప్రసన్న, నటి శ్యామల

కోవూరు : టీడీపీ అభ్యర్థి ప్రశాంతిని గెలిపిస్తే కోవూరులో అశాంతి తప్పదని, నల్లపరెడ్డి కుటుంబం దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉండి మంచి పనులు చేస్తున్నారని నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అనేక విధాలుగా లబ్ధి చేకూర్చిన జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు ఓటు వేయాలని కోరారు. కోవూరులో ప్రశాంతిరెడ్డి అశాంతి సృష్టించేందుకు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని చెప్పారు. ఈ తరుణంలో ప్రశాంతతకు మారుపేరైన ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు మంచి చేసే వారికి జై కొట్టాలని కోరారు. వెన్నుపోటుదారులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డికి ఓటుతో బుద్ధిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన ఒక వైపు, అవినీతికి మారుపేరైన చంద్రబాబు మరోవైపు ఉన్నారని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో మంచి అవగాహన ఉన్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి వలంటీర్ వ్యవస్థను దెబ్బతీసిన వ్యక్తి చంద్రబాబు అని, అలాంటి వ్యక్తికి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు కొనసాగవని తెలియజేశారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. మీ అభిమానం చూస్తుంటే టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ప్రశాంతిరెడ్డికి ఘోర పరాజయం తప్పదని ధీమా వ్యక్తం చేశారు. చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును రాజకీయ చిత్రపటం నుంచి తరిమికొట్టాలని విజయసాయిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రసన్నను గెలిపిస్తే మంత్రివర్గంలో చోటు వస్తుందని, అప్పుడు కోవూరులో అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరుగుతుందన్నారు. ప్రసన్నను మంత్రిని చేసుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు.



ప్రచార కార్యక్రమానికి విశేషంగా హాజరైన ప్రజలు

వేమిరెడ్డి పెద్ద మోసగాడు

కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వేమిరెడ్డి ఎంతపెద్ద మోసగాడో ప్రజలందరికీ తెలుసని చెప్పారు. అయితే విజయసాయిరెడ్డి ఉంటే వారి పప్పులు ఉడకవని తెలిపారు. ఆయన మంచి మనసున్న మారాజు అని, పేదలకు అండగా ఉంటారని తెలియజేశారు. పేదలు జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉంటే ధనవంతులు చంద్రబాబు వైపు ఉన్నారని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో అందరూ ఏకమై జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు, నటి శ్యామల, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి స్థానిక నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. అనంతరం పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

ఆదిశంకరుల జయంతి నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాల వారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి జరగనుందని ఆ ట్రస్ట్ మేనేజర్ సీవీఎల్ నరసింహం శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అష్టావధాని కోట రాజశేఖర్ 'సౌందర్య లహరి సాహిత్య విశ్లేషణ' ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిశంకరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు 'భాష్య సూత్ర ప్రవచన సప్తాహం' ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలకు వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ఆదిశంకరుల కృపకుపాత్రులు కావాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ వివిధ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తాము తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని కోరారు. అల్లర్లు, గొడవలకు తావులేకుండా సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా డయల్ 112కు, స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి వెనుకే లిక్కర్, పేకాట మాఫియా



మాట్లాడుతున్న చలపతిరావు

- 2019 ఫలితాలే పునరావృతం
- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: ప్రశాంతిరెడ్డి.. మీ వెనుక లిక్కర్, పేకాట మాఫియా నేతలను పెట్టుకుని ఇతరులను విమర్శించడం దొంగే దొంగ..దొంగ.. అన్నట్లుందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంతిరెడ్డి అనుచరుడైన విడవలూరుకు చెందిన మాతూరు శ్రీనివాసులురెడ్డి గోవా నుంచి మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. అదేవిధంగా మరో అనుచరుడైన ఆవుల వాసు రూ.కోట్లలో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తూ పట్టుబడలేదా అని ప్రశ్నించారు. ఈ విషయాలను పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ నేతలను మాఫియాలంటూ ప్రశాంతిరెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కోవూరులో టీడీపీ కొత్త, పాత వర్గాల మధ్య కుమ్ములాటలుగా మారిందని తెలిపారు. పార్టీని నమ్ముకున్న దినేష్‌రెడ్డిని పక్కన పెట్టి కాంట్రాక్టర్ సతీమణి ప్రశాంతిరెడ్డికి కోవూరు టిక్కెట్టు ఇవ్వడంతో ఆయన వర్గీయులు టీడీపీని ఓడించాలని కక్షతో ఉన్నారన్నారు. పాత, కొత్త వర్గీయులు బహాటంగానే కుమ్ములాటకు దిగడం దినచర్యగా మారిందన్నారు. అరకొర నేతలను డబ్బు ఎరవేసి కొన్నారే తప్ప క్షేత్రస్థాయిలో లబ్ధి పొందిన వారిలో ఎలాంటి మార్పు లేదని, వారంతా జగన్ వైపే ఉన్నారనే విషయం ప్రశాంతిరెడ్డి గుర్తించుకోవాలన్నారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో 2019 ఫలితాలే పునరావృతం కానున్నాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రంగారెడ్డి, ఎన్.శ్రీనివాసులు, వి.నవీన్, ఎంపీటీసీ పి.అనీల్‌రెడ్డి, నాయకులు ఎ.మోహనకృష్ణ, ఐ.సునీల్‌రెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, సీహెచ్.మనోహర్, ఆర్.రాజేష్‌రెడ్డి, సీహెచ్.శేషగిరి, కె.మల్లికార్జున, కె.సుబ్బరామిరెడ్డి, ఎం.మల్లికార్జున, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మురళీకృష్ణకు జ్యోతిష్యకేసరి అవార్డు



ముత్తుకూరు : హైదరాబాద్ పరశరా అకాడమి ఆఫ్ ఆస్ట్రో సైన్స్ వారు ముత్తుకూరుకు చెందిన జీవీటీ మురళీకృష్ణకు జ్యోతిష్యకేసరి అవార్డును శనివారం అందజేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ మేరకు ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది జ్యోతిష్యులు హాజరయ్యారు.

పోలింగ్ డే విధివిధానాలను పాటించాలి



ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ డే విధివిధానాలను రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి తరఫున వచ్చిన ప్రతినిధులు తప్పనిసరిగా పాటించాలని నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ సూచించారు. పోలింగ్ డే విధివిధానాలపై రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి తరఫున వచ్చిన ప్రతినిధులతో ఆయన శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రం వద్ద పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాల అనుమతులు, అభ్యర్థి వాహనం, ఏజెంట్ వాహనం పట్ల వారికున్న వివిధ సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అభివాదం చేయడం వరకే అభ్యర్థులకు పరిమితి ఉందని, మౌఖిక ప్రచారం చేయడానికి అనుమతులు లేవని ఆర్‌ఓ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని, మంజూరు చేసిన ఐడీ కార్డులను అభ్యర్థులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

రేపు నిమ్మ మార్కెట్‌కు సెలవు

పొదలకూరు : పట్టణంలోని నిమ్మమార్కెట్ యార్డుకు ఎన్నికల సందర్భంగా సోమవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ వ్యాపారి ఎం.బాలకృష్ణారెడ్డి శనివారం తెలిపారు. నిమ్మరైతులు మంగళవారం మార్కెట్‌కు కాయలను తీసుకు రావచ్చని చెప్పారు.

96 మద్యం బాటిళ్ల స్వాధీనం

వెంకటాచలం : వెంకటాచలం సమీపంలోని పొలాల వద్ద గడ్డిమోపుల కింద దాచిన 96 మద్యం బాటిళ్లను సెబ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల వద్ద మద్యం నిల్వలు ఉన్నాయని స్థానికులు సెబ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గడ్డి మోపుల కింద 96 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

జగనన్నది జనరంజక పాలన

ఇందుకూరుపేట : సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది జనరంజక పాలన అని వైఎస్సార్‌సీపీ నేత తిక్కవరపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్‌తో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపీటీసీ కూనంగారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య టీడీపీ నేతల చిచ్చు

- ఇద్దరికి గాయాలు

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం గిరిజన కాలనీలో టీడీపీ నాయకులు గిరిజనుల మధ్య చిచ్చుపెట్టారు. బాధితుల కథనం మేరకు.. గ్రామంలో టీడీపీ నాయకుడు బట్టేపాటి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఓట్లకు తాయిలాలు (డబ్బులు) పంపిణీ జరిగింది. ఈ క్రమంలో కాలనీలో పక్షవాతం బాధితురాలు చింతలపూడి బుజ్జమ్మ, కుమారుడు చెంచయ్య (జగన్‌కు ఓటేస్తారని)లకు అవి అందకుండా చేశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. దీంతో తల్లీ కుమారులపై టీడీపీకి చెందిన వారు దాడి చేశారు. దీంతో వారికి గాయాలయ్యాయి. ఈ సందర్భంగా యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ గిరిజనుల మధ్య చిచ్చుపెట్టిన వారిపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నగదు, మద్యం సీజ్

నెల్లూరు(క్రైమ్): ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యాన్ని పోలీసు, సెబ్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు నవాబుపేట పరిధిలో రూ.1,38,500, దర్గామిట్టలో రూ.29 వేల నగదును సీజ్ చేశారు. బాలాజీ నగర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.16,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచల సత్రం పరిధిలో 11, ఉదయగిరిలో 10, దుత్తలూరులో 14, సెబ్ ఆధ్వర్యంలో 310 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. దుత్తలూరులో 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

కాకాణి విజయం తథ్యం



మనుబోలు : గోవిందరాజపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

మనుబోలు : ఐదేళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం తథ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు గుంజి రమేష్, ఆవుల తులసీరాం ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని గోవిందరాజపురం, జట్లకొండూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన వైనాన్ని గుర్తుచేశారు. కాకాణి మంత్రిలా కాకుండా ఇంటి బిడ్డలా సేవలందించారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు. గ్రామాల అభివృద్ధికి సహకరించిన కాకాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆవుల రమేష్, గుత్తికొండ రమణయ్య, జగదీష్, పచ్చిపాల రామచంద్రారెడ్డి, రవీంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : జట్లకొండూరులో..

- మనుబోలు మండల కేంద్రంలో శ్రీసేవానాథం ట్రస్ట్ అధినేత మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

సకాలంలో టీకాలు వేయాలి



ఏసీ నగర్ కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య

పొదలకూరు : గ్రామాల్లోని పిల్లలకు ఆరోగ్య సిబ్బంది సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, పట్టణంలోని ఏసీనగర్ కాలనీలో శనివారం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సలహాలు, సూచనలు చేస్తూ అవసరమైన వారికి వైద్య సేవలు అందించాల్సిందిగా సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంట డాక్టర్ కిరణ్‌రిషిత, డాక్టర్ శ్రీకావ్య, ఆరోగ్య సహాయకురాలు కామాక్షమ్మ తదితరులు ఉన్నారు.

దళితుల పక్షపాతి వైఎస్ జగన్



ఎన్నికల ప్రచారం చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఇందుకూరుపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతి అని, రాబోయే ఎన్నికల్లో ఆయన్ను గెలిపించుకోవాలని మాల మహానాడు యువత జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్, ఉపాధ్యక్షుడు పెంచలయ్య, అధికార ప్రతినిధి సాయి కోరారు. మండలంలోని కొత్తూరు, జంగంవానిదొరువు గ్రామాల్లో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామంలో కూడా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నది అని చెప్పారు. దళితుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తులసి, రాజేష్, ప్రకాశం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.